సమానత్వం కోసం ఉద్యమించిన మహనీయుడు గద్దర్

రాష్ట్ర సాంస్కృతిక సారథి వెన్నెల

7 లో

నేడు జోగినాథస్వామి రథోత్సవం

7 లో



జగ్గారెడ్డి ఆధ్వర్యంలో
కన్నులపండువగా సీతారాముల కల్యాణం



మాధవానందస్వామి పర్యవేక్షణలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో జగ్గారెడ్డి దంపతులు

- సంగారెడ్డి రాంమందిర్‌కు భారీగా తరలివచ్చిన భక్తులు
- శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి ఆశీర్వచనాలతో ముత్యాల తలంబ్రాల పంపిణీ



జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి రాంమందిర్‌లో వైభవంగా నిర్వహిస్తున్న కల్యాణం

సంగారెడ్డి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సంగారెడ్డిలోని పాతబస్టాండ్ రాంమందిర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో, మహేశ్వర సిద్ధాంతి వేదమంత్రోచ్ఛరణాలతో రాములోరి కల్యాణం కన్నులపండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించి ముత్యాల తలంబ్రాలను స్వీకరించారు. ఎస్పీ పరితోష్ పంకజ్ సీతారాములను దర్శించుకున్నారు. వేడుకలో జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి, కొడుకు భరత్‌సాయిరెడ్డి, ఆలయ వతన్‌దారులు పాల్గొన్నారు. వేలాదిమంది భక్తులకు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రకరకాల ప్రసాదాలను అందజేశారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే కేసీఆర్ సభకు కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దుబ్బాకలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు అంతకుముందు పోతారం గ్రామంలోని చెరువులోకి మల్లన్నసాగర్ ద్వారా గోదావరి జలాలురావడం పట్ల గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలను చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది

- ఎమ్మెల్సీ కవిత

ములుగు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆదివారం గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు శ్రీరామనవమి పురస్కరించుకొని ఆమెను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలకే అధికార పార్టీపై వ్యతిరేకత మొదలైందని, ఎప్పుడు ఎలక్షన్‌లు వచ్చినా ప్రజలంతా కేసీఆర్ ప్రభుత్వం రావాలని ఇప్పటికీ కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీని కలిసినవారిలో సిద్దిపేట జిల్లా అఖిల భారత యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కూచారం రవీందర్‌యాదవ్, నాచారం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మెన్ కొట్టాల యాదగిరి తదితరులు ఉన్నారు.



నడి వేసవిలోనే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గొటిగర్‌పల్లిలో పచ్చని ప్రకృతి దర్శనమిస్తున్నది. చతుర్విధ జల ప్రక్రియతో భూగర్భ జలాలను పెంచడంతో భూమిలో తేమ శాతం అధికంగా పెరగడం, నీటి లభ్యత అధికంగా ఉండటంతో అక్కడ ప్రకృతి వేసవిలోనూ పచ్చగా దర్శనమిస్తున్నది. -కోహీర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి పది మూల్యాంకనం

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం నేటి నుంచి చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో 10 రోజుల పాటు నిర్వహించనున్న మూల్యాంకనం కోసం 1200 మంది ఉపాధ్యాయులను నియమించారు. అన్ని కేంద్రాల్లో మూల్యాంకనం పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటించనున్నారు. రామచంద్రాపురంలోని మూల్యాంకన కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలియజేశారు. కాగా, గతేడాది మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను వారి ఖాతాల్లో జమచేశారు. గతేడా డబ్బులు ఇవ్వకపోతే మూల్యాంకనాన్ని బాయ్‌కాట్ చేస్తామంటూ ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరించడంతో ఆఘమేఘాల ఖాతాల్లో జమచేశారు. ఈసారైనా ఆలస్యం చేయకుండా మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు వెంటనే పారితోషికం అందజేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు.



మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేసిన రామచంద్రాపురం సెయింట్ ఆర్నాల్డ్ స్కూల్

విధుల్లో చేరిన సఫాయిలు

ఎమ్మెల్యే సూచనతో సమ్మె విరమణ

రెండు రోజుల్లో జీతాలు చెల్లిస్తామని రోహిత్‌రావు హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రామాయంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): 'సమస్యల వలయంలో సఫాయిలు' అంటూ ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ప్రజా ప్రతినిధులను కదిలించింది. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జోక్యం చేసుకోవడంతో రామాయంపేటలో కార్మికులు విధుల్లో చేరారు. ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ఎట్టకేలకు కార్మికులను విధుల్లో చేరేలా ఒప్పించారు. రెండు రోజుల్లో నెల వేతనాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మూడు రోజుల్లో పెండింగ్ పీఎఫ్ బిల్లుల విషయంలో మెదక్ ఆర్డీవో వద్దకు కార్మికులను తీసుకువెళ్లి చర్చిస్తానని చెప్పారు. దీంతో, విధులు బహిష్కరించి భిక్షాటన చేసిన సఫాయి కార్మికులు తిరిగి విధుల్లో చేరారు. దీంతో, శ్రీరామ నవమి పర్వదినాన చెత్తకుప్పలు పేరుకున్న రోడ్లన్నీ శుభ్రపరచడంతో మున్సిపల్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కల్యాణ వైభోగం





వాడవాడలా సీతారాముల కల్యాణం

వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

ఉదయం నుంచే కిటకిటలాడిన ఆలయాలు



జహీరాబాద్‌లో శోభాయాత్రలో పాల్గొన్న సినీహీరో మంచు మనోజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తీరొక్క పందిళ్లు.. మేళతాళాల చప్పుళ్లు.. ఎదుర్కోళ్లు, వేద మంత్రాలు... భక్తుల జయజయ ధ్యానాల మధ్య సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. జిల్లావ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాల కోసం పోటీ పడ్డారు. మెదక్‌లోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పల్లకీలో అమ్మవారిని, స్వామివారిని ఊరేగింపు తీసుకువచ్చారు. మావంశం గొప్పదంటే... మా వంశం గొప్పదని చెప్పుకుంటూ పెద్దలు ఇరువైపులా చేరి ఎదుర్కోళ్ల వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీటలపై ప్రతిష్ఠింపజేశారు. సుముహూర్తం ప్రారంభం కాగానే ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదనాచార్యులు, అర్చక స్వాములు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నయనానందకరంగా జరిపించారు. వేడుకను వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది. జిల్లా కేంద్రమంతా రామనామ స్మరణతో భక్తి పారవశ్యంతో మార్మోగింది. అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌రావు దంపతులు దేవతామూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి, పూజలో పాల్గొన్నారు. మాజీ పద్మాదేవేందర్ రెడ్డి దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారిని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, మాజీ కౌన్సిలర్లు జయశ్రీ దుర్గాప్రసాద్, ఆర్కెశ్రీను, అంజనేయులు, నేతలు పాల్గొన్నారు.

రాముడి జీవితం ఆదర్శనీయం : మంత్రి దామోదర్

జోగిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడి జీవితం లోకమంతటికీ అనుసరణీయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. జోగిపేట పట్టణంలో, మునిపల్లి మండల పరిధిలోని చిన్నచెల్మెడలో ఆదివారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాముడి ధర్మపరాయణత, నీతివంతమైన పాలన ప్రపంచానికి దిక్సూచిలాంటిదన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. జోగిపేటలో వేడుకల్లో మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు, ఎం.మల్లిఖార్జున్‌గుప్త, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్.కృష్ణారెడ్డి, సురేందర్‌గౌడ్, ప్రవీణ్, చిట్టిబాబు, శంకర్, ధనలక్ష్మి, రవి, వెంకటేశం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని డాకూరులో నిర్వహించిన ఉత్సవాల్లో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ పట్లోల్ల మంజుశ్రీ జైపాల్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారి కల్యాణం జరిపించారు.



జోగిపేటలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఎంసీహెచ్ డీలా.. ఎందుకిలా?

- తగ్గుతున్న ప్రసవాలు
- పడిపోతున్న నార్మల్ డెలివరీలు
- ఏడాదిలో 104 శిశు మరణాలు
- రాష్ట్రంలో అగ్రస్థానానికి ఎసరు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పరిధిలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో ప్రసవాల సంఖ్య తగ్గుముఖం పడుతున్నాయి. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, నిపుణులైన డాక్టర్లతో వైద్య సేవలందిస్తుందిస్తున్నా ప్రసవాలు క్రమంగా తగ్గడం ఆందోళకు గురి చేస్తున్నది. ఒకప్పుడు ప్రసవాల్లో సంగారెడ్డి సర్కారు దవాఖానా అంటేనే రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండేది. కానీ ప్రస్తుత గణాంకాలు పరిశీలిస్తే అగ్రస్థానం కోల్పోయే అవకాశం లేకపోలేదు.

ఏడాదిలో 8,445 ప్రసవాలు

సంగారెడ్డి ఎంసీహెచ్‌లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 8,445 ప్రసవాలు జరిగాయి. అందులో 4,388 సాధారణ, 4,057 సీజేరియన్‌లు జరిగాయి. 2024 ఏప్రిల్ నెలలో 759 ప్రసవాలు జరగగా, 2025 మార్చి నెలకు వచ్చేసరికి ఆ సంఖ్య 569కు పడిపోయింది. ఫలితంగా 190 ప్రసవాల సంఖ్య తగ్గాయి. అంతే కాకుండా సీజేరియన్ ప్రసవాలకు దగ్గరగానే సాధారణ ప్రసవాల సంఖ్య ఉండడం గమనార్హం.

కాలయాపన.. ఈసడింపులు..

సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో ప్రసవం కోసం ఈ జిల్లా నుంచే కాకుండా మెదక్, నర్సాపూర్, వికారాబాద్, మోమిన్‌పేట, శంకర్‌పల్లి ప్రాంతాల నుంచి కూడా గర్భిణులు వస్తుంటారు. నిత్యం 20-30 డెలివరీలు జరుగుతుంటాయి. అయితే, ఇటీవల డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం, కాలయాపన చేయడం, అమర్యాదగా ప్రవర్తించడం, వరుసగా శిశు మరణాలు సంభవించడం తదితర కారణాలతో ఈ దవాఖానాకు రావడానికి గర్భిణులు జంకుతున్నారు. తాము మహిళలమేనన్న విషయం మరిచిపోయి డాక్టర్లు, సిబ్బంది దారుణంగా ప్రవర్తిస్తున్నారని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు.

వందకు పైగా శిశు మరణాలు

ప్రసవానికి వచ్చిన గర్భిణులకు తొలుత సాధారణ ప్రసవం కోసం ప్రయత్నం చేయాలని, తప్పనిసరి అయితేనే సీజేరియన్ చేయాలని సర్కారు దవాఖానాలో వైద్యులకు సూచిస్తారు. అయితే, అవకాశం లేకపోయినా సాధారణ ప్రసవం కోసం ఎదురుచూస్తూ ఉండటంతో గర్భస్థశిశు (ఐయూడీ)మరణాలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ప్రయత్నించినా సాధారణ ప్రసవం సాధ్యం కాకపోవడంతోనే జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారని గర్భిణుల కుటుంబ సభ్యులు చెప్పినా పట్టించుకోకుడా సాధారణ ప్రసవం పేరిట కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఆస్పత్రిలో నెలలో కనీసం 5-10 ఐయూడీ మరణాలు సంభవిస్తుండటం గమనార్హం. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు ఏడాది కాలంలో 104 ఐయూడీ మరణాలు సంభవించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది.

సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో గతేడాది ప్రసవాల సంఖ్య

నెలవారీగా		సాధారణ	సిజేరియన్	మొత్తం
2024	ఏప్రిల్	413	346	759
	మే	401	381	782
	జూన్	300	345	645
	జూలై	371	335	706
	ఆగస్టు	418	381	799
	సెప్టెంబరు	358	354	712
	అక్టోబరు	459	377	836
	నవంబరు	386	321	707
	డిసెంబరు	376	330	706
2025	జనవరి	342	308	650
	ఫిబ్రవరి	288	286	574
	మార్చి	276	293	569

ఎక్కడి ప్రసవాలు అక్కడే



సంగారెడ్డి ఎంసీహెచ్‌కు జిలాతోపాటు మెదక్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రసవం కోసం వచ్చేవారు. ఆయా జిల్లాలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు కావడంతో ఎక్కడి ప్రసవాలు అక్కడే జరుగుతున్నాయి. గర్భిణుల వచ్చినప్పుడు డాక్టర్లు, సిబ్బంది వెంటనే స్పందిస్తున్నారు. మాతాశిశు మరణాల నివారణకు తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం.

-డా.అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, సంగారెడ్డి జీజీహెచ్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- టేక్మాల్ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

టేక్మాల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా కళాశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందిస్తున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కస్తూర్బా కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయాలు, దినుసులు నాణ్యతతో ఉండాలని సూచించారు. భోజనం తయారు చేసిన వెంటనే రుచి చూసి విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని 33/11కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బియ్యం సరఫరా వేగవంతం

పాపన్నపేట: సన్న బియ్యం సరఫరా వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ గుత్తేదారులకు సూచించారు. పాపన్నపేట సివిల్ సప్లై గోదాంను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో బియ్యం లేకపోవడంతో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాపన్నపేట గోదాంకు రావలసిన సన్న బియ్యం సగమే చేరుకోగా, వాటిని డీలర్లకు పంపిణీ చేసినట్లు సిబ్బంది తెలిపారు. మిగిలిన బియ్యాన్ని వెంటనే పంపించాల్సిందిగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం ప్రజలకు త్వరగా అందేవిధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. సన్న బియ్యంలో నూకలు వస్తున్న విషయాన్ని విలేకరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నూకలు వస్తే వెంటనే వాపస్ పంపాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు.











వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

- మద్యానికి బానిసై ఇద్దరు యువకులు
- అనారోగ్యంతో బాధపడుతూ ఒకరు
- ప్రేమ పెళ్లి నిరాకరించడంతో యువతి

తొగుట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. తొగుట పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని ఎల్.బంజర్‌పల్లి గ్రామానికి చెందిన బొమ్మ రాజు(32)కి భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది రోజుల నుంచి అతడు మద్యానికి బానిసగా మారాడు. ఈ విషయమై కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. ఎన్నిసార్లు చెప్పిన రాజు మద్యాన్ని మాత్రం మానలేదు. రోజు మాదిరిగా రాజు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య కవిత రాజు ప్రవర్తన నచ్చక పక్కింటికి వెళ్లింది. అదే సమయంలో మద్యం మత్తులో రాజు ఇంట్లోని రేకులపైపునకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

చింతమడకలో మరో యువకుడు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు వివరాల ప్రకారం.. మండలంలోని చింతమడక గ్రామానికి చెందిన పెద్దెల్లి నర్సింహులు(38) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అప్పులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో అప్పుల విషయంలో భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. శనివారం ఇదే విషయంలో భార్యతో గొడవ పెట్టుకుని పొలం వద్ద బావి దగ్గరికి వెళ్తున్నా అంటూ ఇంట్లో చెప్పి వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో నర్సింహులు భార్య మరిది యాదగిరికి చెప్పింది. యాదగిరి బావి దగ్గరకు వెళ్లి చూసేసరికి చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట రూరల్ పోలీసులు సందర్శించి మృతుని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో మనస్తాపానికి గురై..

రాయపోల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ రఘుపతి, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని రామారం గ్రామానికి చెందిన కొమ్మాయిపల్లి రామస్వామి(40) ఆరు నెలల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎన్నిసార్లు చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం పొలం దగ్గరికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన రామస్వామి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామస్వామికి భార్య స్వప్న, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

చేగుంట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి వద్దని అక్కబావ మందలించడంతో యువతి ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన చేగుంట మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం భాగీరథిపల్లి గ్రామానికి చెందిన పెద్దోల్ల ఎల్లవ్వ, మల్లేశం దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె శిరీషను చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన రవికి ఇచ్చి వివాహం చేశారు. రెండు సంవత్సరాల క్రితం నుంచి రెండో కూతురు వరలక్ష్మి(18) బోనాలలోని తన అక్క వద్ద ఉంటుంది. వరలక్ష్మి ప్రేమ విషయం తెలుసుకున్న అక్క శిరీష, బావ రవి ప్రేమ పెళ్లి వద్దని రెండు నెలల క్రితం మందలించారు. ఈ నెల 4న అక్కబావ భాగీరథిపల్లికి పని నిమిత్తం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వరలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చుట్టుపక్కల వారు బంధువులకు సమాచారం ఇచ్చి, వరలక్ష్మిని నార్సింగిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మేడ్చల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రి తరలించారు.

కుక్కల దాడిలో జింక మృతి


జగదేవ్‌పూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున తిగుల్, గణేష్‌పల్లి రోడ్డు పక్కన వ్యవసాయ భూమిలో కుక్కలు జింకను వెంటాడాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జింక మృతి చెందింది. స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా బీట్ ఆఫీసర్ రాజు అక్కడికి చేరుకొని పంచనామా చేశారు.



జింక కళేబరం







అంబులెన్స్, బైక్ ఢీ.. ఒకరి మృతి



శంభు రమేష్(ఫైల్)

రాయపోల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం దౌల్తాబాద్ 108 అంబులెన్స్ గజ్వేల్ ఆసుపత్రికి ఓ పేషెంట్‌ను తీసుకెళ్తున్నది. అదే సమయంలో రాంసాగర్ గ్రామానికి చెందిన శంభు రమేష్(38) రాయపోల్ వైపు బైక్‌పై వస్తున్నారు. రాయపోల్ సమీపంలో అంబులెన్స్, బైక్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రమేష్ తలకు తీవ్ర గాయాలు కాగా, మరో అంబులెన్స్‌లో గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు.

ఈతకు వెళ్లి.. ఇద్దరు యువకుల మృతి

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సరదాగా ఈతకు వెళ్లి నీటమునిగి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన మెదక్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. బొల్లారం గ్రామానికి చెందిన తుడుం అనిల్ (18), తుడుం నవీన్(22) ఇద్దరు కలిసి శనివారం గ్రామ శివారులో ఉన్న బొల్లారం మత్తడి వద్దకు సరదాగా ఈత కోసం వెళ్లారు. అయితే రాత్రి 8 గంటల వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్థులు మత్తడి వద్దకు వెళ్లి చూడగా అక్కడ గట్టుపై అనిల్, నవీన్ దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం ఉదయం గజ ఈతగాళ్ల గాలింపు చేపట్టారు. మత్తడిలో అనిల్, నవీన్ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈత కోసం దిగడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.



అనిల్(ఫైల్)



నవీన్(ఫైల్)

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- పది మంది అరెస్ట్

చేగుంట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్న సంఘటన ఆదివారం నార్సింగ్ మండలం నర్సంపల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. నార్సింగ్ ఎస్‌ఐ అహ్మద్ మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నర్సంపల్లి శివారులోని మహమ్మద్ అజాం వ్యవసాయ పొలం వద్ద పేకాట ఆడుతున్నారని నమ్మదగ్గ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఎస్‌ఐ దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని రూ.30 వేల నగదుతో పాటు పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు

గుమ్మడిదల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో వరుస దొంగతనాలతో గుమ్మడల మండల ప్రజలను బెంబేలెత్తిస్తున్న నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు గుమ్మడిదల పోలీసులు తెలిపారు. గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్, ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం షాబాష్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్, చాపల సంజీవ్ ఇద్దరు కలసి గుమ్మడిదల, రామ్‌రెడ్డిబావి, కానుకుంట, నల్లవల్లి గ్రామాల్లో రాత్రి వేళలో తిరుగుతూ గ్రామానికి బయట ఉన్న ఆలయాలను ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయాల్లోకి చొరబడి హుండీలను పగలగొట్టి దోచుకుంటున్నారు. వరుస దొంగతనాలతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఆదివారం ఉదయం గుమ్మడిదల పోలీసులు సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు కలిసి దొంగలను అదుపులోకి తీసుకుని, విచారించి వారి వద్ద నుంచి రూ.25 వేల నగదు, పల్సర్ బైకు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు. వీరిలో షేక్ ఫయాజ్‌పై 33 దొంగతనం కేసులు, చాపల సంజీవ్‌పై 26 కేసులు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు ప్రభు


నల్లవల్లి నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో డంపుయార్డు వద్దంటూ వేడుకుంటున్న మహిళలు

డంపుయార్డ్ మాకొద్దంటూ రాముడికి పూజలు

గుమ్మడిదల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తమపై కనికరం చూపాలని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలంటూ నల్లవల్లి జేఏసీ నేతలు వేడుకున్నారు. మండలంలోని నల్లవల్లిలో 61వ రోజు ఆదివారం ప్యారానగర్ డంపుయార్డుకు వ్యతిరేకంగా రిలే దీక్ష కొనసాగింది. రిలే నిరాహార దీక్షలో బొంతపల్లి శ్రీమణికంఠ తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా జేఏసీ నేతలు, ప్రజలు వినూత్న నిరసన తెలిపారు. నల్లవల్లి గ్రామంలో జరుగుతున్న సీతారామ కల్యాణానికి మహిళలతో కలిసి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డంపుయార్డ్ కంపు వదిలించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ సభ్యులు మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జోగినాథస్వామి రథోత్సవం

జోగిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలోని జోగినాథస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రథత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. జోగినాథుడి ఇనుప రథం జిల్లాలోనే అతిపెద్దదిగా పేరుగాంచింది. ఈ రథాన్ని 30 టన్నుల ఇనుముతో 50 అడుగుల ఎత్తుతో 5 అంతస్తులతో ఉంటుంది. దగద్ధాయమైన విద్యుత్‌దీప కాంతులు, వివిధరంగులతో ఈ రథాన్ని చూడముచ్చటగా అలంకరింపజేశారు. రథంపై శనివారం శిఖర స్థాపనను ప్రారంభించారు. మొదటగా ఆలయ పూజారి భద్రప్ప స్వామి, కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్ పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణానికి చెందిన వివిధ రకాల కులవృత్తుల వారు రథ శిఖరంపై ప్రతిష్ఠించే గుండ్లు (పెద్ద ఇత్తడి గోళాలు, వాటిపై అలంకరించే ఇత్తడి త్రిశూలం)కు ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజ చేశారు. ఆ తర్వాత మేళతాళాల మధ్య, వాటిని గౌని చౌరస్తాలో ఉంచిన రథం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి, రథంపై ప్రతిష్ఠించారు. దీంతో రథ శిఖర స్థాపన పూర్తైంది. సోమవారం రాత్రి 8:30 గంటలకు రథానికి ప్రత్యేక పూజలు జరిపి, అన్న రతిని నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించనున్నారు. వేడుకల స్థానిక హనుమాన్ కూడలి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలను, పూజాకార్యక్రమాలు వినపడేందుకు మైక్‌సెట్లను అమర్చారు. భక్తుల కోసం తాగునీటి వసతిని ఏర్పాటు చేస్తున్నారు.

శిఖర స్థాపనతో రథం




గద్దర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక సారథి వెన్నెల, తదితరులు

సమానత్వం కోసం ఉద్యమించిన మహనీయుడు గద్దర్

రాష్ట్ర సాంస్కృతిక సారథి వెన్నెల

రామచంద్రాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సమానత్వానికి ఉద్యమించిన మహనీయుడు గద్దర్ అని, ప్రజాసమస్యల పరిష్కారానికి ఎన్నోసార్లు పోరుబాట పట్టారని రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్‌పర్సన్ వెన్నెల అన్నారు. గద్దర్‌పై కాల్పులు జరిపిన రోజును పురస్కరించుకుని గద్దర్ గళం ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సామాజిక వేత్తలు పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య, కొల్లూరు సత్తయ్య, సజ్జల సామయ్య మాట్లాడుతూ గద్దర్ స్ఫూర్తితో మనువాద సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్‌కుమార్ మాట్లాడుతూ రూ.1.25 కోట్లతో గద్దర్ స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం


తలంబ్రాల వేడుక

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ఇద్దరు యువకుల హత్య

సిద్దిపేట జిల్లా కోమటిబండలో తలపై రాడ్‌తో కొట్టడంతో ఒకరు మృతి

సంగారెడ్డి జిల్లా ధనసిరిలో గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో మరొకరు



కోమటిబండలో హత్యకు గురైన ఆంజనేయులు, ధనసిరిలో రక్తమడుగులో అబ్బాస్

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కర్మపట్ల గూడెం గ్రామానికి చెందిన సిద్ధిని అంజనేయులు(30) తల్లిదండ్రులతో కలిసి ప్రజ్ఞాపూర్‌లో నివాసం ఉంటున్నారు. కోమటిబండకు చెందిన ప్రేమకు అంతకు ముందే వివాహమై, ఒక కూతురు ఉండగా, 2020లో ఆమెను ఆంజనేయులు పెళ్లి చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు జన్మించాడు. ఆంజనేయులు దగ్గర ప్రేమ తల్లి రూ.3 లక్షలు తీసుకున్నారు. కొన్ని రోజుల నుంచి డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం డబ్బులు కావాలని అత్తగారి ఇంటికి వచ్చి ఆంజనేయులు గొడవకు దిగారు. తలుపులు, బాత్రూం డోర్లు పగలగొట్టాడు. ప్రేమ బావ ఇట్టల శివ(49)తో ఆంజనేయులకు గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆవేశానికి గురైన శివ ఆంజనేయులు తలపై రాడుతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మారణాయుధాలతో దాడిచేసి..

జహీరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధనసిరి గ్రామానికి చెందిన అబ్బాస్(25) కొంతకాలంగా సంగారెడ్డిలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రంజాన్ పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని ఓ షెడ్‌లో విందు చేసుకునేందుకు ఐదుగురు స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ వంట వండుతున్న క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చి అబ్బాస్‌పై మారణాయుధాలతో దాడిచేసి హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నగలు, డబ్బు కోసమే వృద్ధ దంపతుల హత్య

- అనుమానాస్పద మృతిని ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్ : ఏసీపీ మధు


నిందితులను చూపుతున్న ఏసీపీ మధు

నంగునూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతుల అనుమానాస్పద మృతి కేసును పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. డబ్బు, నగల కోసమే వారిని హత్య చేశారని చెబుతూ, హత్య చేసిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఏసీపీ మధు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన ఆవుల కొమురయ్య, ఆవుల భూదవ్వ ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం సీఐ శ్రీను బద్దిపడగలో కేసు విచారణ చేస్తుండగా పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పారియేందుకు యత్నించగా, వారిని పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. మండలంలోని బద్దిపడగ గ్రామానికి చెందిన పసుపుల సంపత్, మాలోతు రాజు, మాలోతు శ్రీకాంత్ దొంగతనాలకు అలవాటు పడ్డారు. వీరిపై గతంలో పలు కేసులు కూడా నమోదయ్యాయి. వారు నంగునూరుకు చెందిన పరశురాములు తల్లిదండ్రులను ఎలాగైనా చంపి డబ్బు, బంగారం నగలను దోచుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 2న అర్ధరాత్రి ముగ్గురు మోటార్ సైకిల్‌పై భూదవ్వ, కొమురయ్య నివాసం ఉంటున్న వ్యవసాయ క్షేత్రంలోని పౌల్ట్రీఫామ్ వద్దకు వెళ్లారు. కొడుకు పరశురాములు లేని సమయంలో మాలోతు శ్రీకాంత్ బయట కాపలా ఉండగా, పసుల సంపత్, మాలోతు రాజు ఇద్దరు కలిసి ఇంట్లోకి చొరబడి, దంపతులను చంపి, బంగారం, వెండి ఆభరణాలను తీసుకొని పారిపోయారు. చోరీ చేసిన వస్తువులను అమ్మి ముగ్గురు పంచుకున్నారు. నిందితులు నేరం ఒప్పుకోగా వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, వెండి మొలతాడు, నగదు రూ.30,800 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ విద్యార్థులకు సైకిళ్లు

- మంత్రి దామోదర్ చొరవ

పుల్‌కల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఇక గ్రీన్ క్యాంపస్‌గా మారనున్నది. కళాశాలలో కాలుష్య వాహనాలు తిరగకుండా ఉండేందుకు వంద సైకిళ్లు మంజూరయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రత్యేక చొరవ తీసుకుని సీఎస్ఆర్ కింద వంద సైకిళ్లను మంజూరు చేయించారు. వసతి గృహాలకు దూరంగా కళాశాల ఉండటంతో నిత్యం క్లాస్‌లకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులకు ఉపయోగపడతున్నాయి. విద్యార్థినులకు 40, విద్యార్థులకు 60 సైకిళ్ల చొప్పున అందజేయనున్నారు. సైకిళ్ల పార్కింగ్ చేసేందుకు సైకిల్ ప్లాట్‌ఫాం, షెడ్డును నిర్మించారు. మంత్రి దామోదర్ చేతుల మీదుగా త్వరలో ఈ విద్యార్థులకు సైకిళ్లను అందజేయనున్నారు.


కళాశాలలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన సైకిల్ షెడ్డు

రూ.1.97 కోట్లతో అభివృద్ధి పనులు

సుల్తాన్‌పూర్ ఇంజనీరింగ్ కళాశాలలో రూ.1.97 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గతేడాది మంత్రి స్వయంగా కళాశాలను సందర్శించి మౌలిక అవసరాలను ఒక్కొక్కటిగా తీరుస్తున్నారు. కళాశాల ఆవరణలో సిమెంటు రోడ్లు, ప్రహరీ గోడ నిర్మాణం పనులను చేపట్టారు.

యూనివర్సిటీగా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ



సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవిషతులో యూనివర్సిటీగా మారనున్నది. యూనివర్సిటీగా ఏర్పాటయ్యేందుకు అన్నీ అర్హతలు ఉన్నాయి. దాదాపు 250 ఎకరాలకు పైగా సువిశాల విస్తీర్ణంలో ఇంజనీరింగ్ కళాశాల విస్తరించి ఉన్నది. జీ+2 విధానంలో వసతి గృహ సముదాయాలు, తరగతుల నిర్వహణకు భవనాలు నిర్మించాము. 24 గంటలు విద్యుత్, సోలార్ ప్లాంట్, తాగునీటి అవసరాలకు మంజీర జలాలు, ఆధునాత ఇంటర్నెట్ సౌకర్యం, మైదాన ప్రాంతం కలిగి ఉన్నాయి. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూను నెలకొల్పాను. ఈ కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చేందుకు మరింతగా కృషి చేస్తాను.

– దామోదర్ రాజనర్సింహ, మంత్రి

తాటి ముంజలు వచ్చేశాయ్


అక్కన్నపేటలో రోడ్డు పక్కనే అమ్ముతున్న తాటిముంజలు



అక్కన్నపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మాత్రమే లభించే ప్రకృతి వరప్రసాదం తాటి ముంజలు వచ్చేశాయ్. ఎండాకాలం వచ్చిందంటే తాటి ముంజల కోసం అందరూ ఎదురు చూస్తూ ఉంటారు. కల్తీకి అవకాశం లేకుండా ఉండే ముంజలను ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. మండుతున్న ఎండలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు చుక్కలు చూపిస్తున్నాయి. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రస్తుతం అందుబాటులోకి తాటి ముంజలు వచ్చాయి. ఒంటికీ చలువ కలిగించే ముంజలు తినేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో తాటి ముంజలను ప్రధాన రహదారి పక్కనే విక్రయిస్తున్నారు. డజన్ ముంజలజూజీ రూ.100లకు అమ్ముతున్నారు. ప్రస్తుతం తాటి ముంజలు తినేందుకు తాటి వనాలకు ప్రజలు క్యూ కడుతున్నారు.


తాటిచెట్టు నుంచి దింపిన ముంజకాయలు



నారాయణఖేడ్‌లోని రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, సతీమణి ఉమాదేవి



పటాన్‌చెరు: సీతారాముల కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తెస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు



సంగారెడ్డిలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వైభవంగా సీతారాముల కల్యాణం

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోదండ రామాలయాల్లో సందడి నెలకొన్నది. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కల్యాణంలో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

\- న్యూస్ నెట్‌వర్క్



కొండాపూర్ మారేపల్లిలో లక్ష్మీనారాయణ ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



రామచంద్రాపురం టౌన్: అపార్ట్‌మెంట్ నివాసితుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



పటాన్‌చెరు రూరల్ : ఇస్నాపూర్‌లో మాజీ సర్పంచ్ గడ్డం శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణంలో కాంగ్రెస్ నాయకుడు నీలం మధు



నర్సాపూర్ : మండలం సీతారాంపూర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



మెదక్ అర్బన్: సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దంపతులు



పెద్దశంకరంపేటలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు



మెదక్ అర్బన్: స్వామివారిని ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు



శ్రీరామ నవమి సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో శ్రీరాముడు, హనుమంతుడి శోభాయాత్రలో భక్తులు



శివ్వంపేట మండలం చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



తూప్రాన్‌లో సీతారాముల కల్యాణానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



పాపన్నపేట: సీతారాముల కల్యాణానికి ఏడుపాయల వన దుర్గామాత ఆలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

భూమి పూజ

నారాయణఖేడ్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి వంటగది, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల కోసం అవసరమైన స్థలాన్ని ఆలయం పక్కనున్న స్థల యజమాని దరుగొండ మనోహర్ కుటుంబీకులు భక్తి భావంతో తక్కువ ధరకు విక్రయించడమే కాకుండా నిర్మాణం కోసం రూ.2,11,000 లక్షలను విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు మలమంచి మోహన్ జ్యోషి అర్చకులు రమేష్ పంతులు, వారి చేత భూమి చేయించారు.

గెలుపోటములు సహజం

మునిపల్లి , ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమేనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ అన్నారు. మండలంలోని బుదేరా గ్రామంలో సీజన్-5 గేమ్ ఛేంజర్ క్రికెట్ వన్డె టోర్నమెంట్‌ను ఏఎంసీ మాజీ డైరెక్టర్ బోయిని మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం రాత్రివరకు కొనసాగగా పోటీల్లో నవీన్ టీం రన్నర్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి సాయికుమార్ హాజరై బహుమతులు అందజేశారు.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

జోగిపేట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. లింగంపల్లికి చెందిన సంతోష్ మద్యం మత్తులో అందోల్ బస్టాప్ వద్ద ఆదివారం సాయంత్రం బైక్ అదుపు తప్పి కిందపడగా తీవ్రగాయాలు కాగా జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువతి అదృశ్యం



ప్రవళిక(ఫైల్)

పుల్‌కల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రమైన పుల్కల్‌లో చోటు చేసుకున్నది. ఎస్ఐ పాటిల్ క్రాంతికిరణ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైసన్నగారి ప్రేమ్‌కుమార్ కూతురు ప్రవళిక(20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఆదివారం ఉదయం 4 గంటలకు ఇంట్లోంచి వెళ్లిపోయింది. తండ్రి ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనోహర్‌రావును ఆదర్శంగా తీసుకోవాలి

● ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత మనోహర్‌రావును ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ సురేష్‌షెట్కార్ సూచించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని ఉజలంపాడ్‌కు చెందిన మనోహర్‌రావు గ్రూప్-2లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించడంతో ఆదివారం నారాయణఖేడ్‌లో ఎంపీ ఆయనను అభినందించి మాట్లాడారు. ఖేడ్ ప్రాంత యువకులు చదువులో ముందుండి విజయాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. యువత బాగా చదివి ఉద్యోగాలు సాధించి దేశానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, నాయకులు సాయిలు, వీరశెట్టి, శివపటేల్, సాయి చరణ్, భక్షిరాం పాల్గొన్నారు.



గ్రూప్-2 రాష్ట్ర 3వ ర్యాంకర్ మనోహర్‌రావును సన్మానించిన ఎంపీ సురేష్‌షెట్కార్

60 ఫీట్ల రోడ్డు వెడల్పుతో ఉపయోగమేది

● మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వట్‌పల్లిలో విస్తరించనున్న రోడ్డును 30 ఫీట్లకు కుదిస్తే వచ్చే నష్టమేంటని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రమైన వట్‌పల్లిలో రోడ్డు విస్తరణలో ఇల్లు దుకాణాలు కోల్పోతున్న బాధితులను పరామర్శించి మాట్లాడారు. అభివృద్ధి అవసరమే అయినా కొన్ని దశాబ్దాలుగా ఇండ్లు, దుకాణాలు నిర్మించుకొని బతుకుతున్న వారిని రోడ్డుపాలు చేసి అభివృద్ధి చేయడం ఏ విధంగా న్యాయమో మంత్రి దామోదర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వట్‌పల్లి ఉన్న రోడ్డు విస్తరించాలని భావించడం తప్పేమీ కాదని, అయితే అది మారుమూల మండల కేంద్రం కాబట్టి 30 ఫీట్లకు కుదిస్తే వచ్చే నష్టమేమిటో కూడా మంత్రి వివరించాలన్నారు. మంత్రిగా ప్రజలను ఆదుకోవాల్సింది పోయి ఇబ్బందిపెట్టే విధంగా 60 ఫీట్లకు వెడల్పు చేస్తాననడం సమంజసం కాదన్నారు. బాధితులకు అండగా నిలిచి, వారు నష్టపోకుండా ప్రభుత్వంతో పోరాటం చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వినోద్ గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, గ్రామ అధ్యక్షుడు ప్రకాశ్, మాజీ డైరెక్టర్లు మధుశ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : స్వామివారి ఆజ్ఞతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. ఆదివారం సీతారాముల కల్యాణం అనంతరం అనంత పద్మనాభస్వామిని దర్శించుకుని మాట్లాడారు. స్వామి కృపతో మెదక్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంత పద్మనాభగుట్ట అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జీవన్, నాయకులు మోహన్ నాయక్, గణేష్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలోని పెద్ద చెరువు వద్ద గంగమ్మ గుడి నిర్మించేందుకు సహకరించాలని కోరుతూ ఆదివారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గుడి నిర్మాణానికి సహకరిస్తానని హామీఇచ్చారు.

'వీరహనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలి'

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా 12న నిర్వహించే వీరహనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని శ్రీవైకుంఠపురం ఆలయ అర్చకుడు కందాడై వరదాచార్యులు కోరారు. సంగారెడ్డి శివారులోని ఆలయ ప్రాంగణంలో ఆదివారం విజయ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీ భవనీ మందిర్ వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమై వైకుంపురం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రసార తెలంగాణ ప్రాంత సహ ప్రముఖ్ సుభాష్‌చందర్, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచార ప్రముఖ్ అంబరీష్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ప్రకాశ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటకు చెందిన నవీన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందగా వైద్యశాల ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.10 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆమె కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రుబీనాబేగంనజీబ్, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు జగన్‌చారి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

సంగారెడ్డి విద్యార్థులకు ఎక్స్‌ప్లోరా అవార్డులు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన విద్యార్థులు ఎక్స్‌ప్లోరా రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డులను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాజీ జేడీ లక్ష్మీనారాయణ, మాస్టర్ మైండ్స్, కృష్ణవేణి పాఠశాలల చైర్మన్లు రాజు సంగాని, కల్నల్ శ్రీనివాస్ రావు, ప్రొఫెసర్ విశ్వం అందజేశారు. ఈ అవార్డులను ముత్తంగిలోని కృష్ణవేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో కీర్తిక ప్రథమ బహుమతి, రీజనల్ స్థాయిలో యశ్వంత్, మాధురి, సహస్రరెడ్డి, హర్షిక్, ప్రమోద్, సీహెచ్. సహస్ర, చెర్రి వర్మ, అలియాబేగం, నిహారికరెడ్డిలు అందుకున్నారు. ఈ కారక్రమంలో కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్ ప్రిన్సిపల్ రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి



గుమ్మడిదల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైనట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీనియర్ నాయకుడిగా పార్టీకి అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం నియోజవర్గస్థాయి నామినేట్ పోస్టు అయిన వ్యవసాయ అనుబంధ శాఖ ఆత్మ కమిటీ పాలకవర్గానికి చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డిని నియమించింది. నేడు నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం పదిగంటలకు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పాలకవర్గ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

'కార్మికవర్గ ఐక్యతకు బీటీ రణదివే కృషి'

పుల్‌కల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కార్మికవర్గం ఐక్యత కోసం సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివే విశేష కృషి చేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాగారెడ్డి అన్నారు. చౌటకూర్ మండలం శివంపేట చార్మినార్ బీరు పరిశ్రమలో ఆదివారం రణదివే 35వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముంబయిలో టెక్స్‌టైల్ మిల్లుల కార్మికుల సమస్య పరిష్కారానికి ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పరిశ్రమ యూనియన్ కోశాధికారి విష్ణువర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

మనోహరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రామాచారి

మనోహరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జోన్నోజీ రామాచారి(సాక్షి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు పురం మహేష్‌ముదిరాజ్ తెలిపారు. ఆదివారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రాగిశెట్టి శ్రీనివాస్(నవతెలంగాణ), ఉపాధ్యక్షులుగా భరత్‌గౌడ్(వెలుగు), రమేష్(ప్రజాజ్యోతి), సలహాదారులుగా వెంకటేష్‌యాదవ్(వార్త), వీరబోయిన మహేష్(తెలంగాణ కేసరి), శివకృష్ణగౌడ్ (నగర నిజం), ఆర్గనైజర్‌గా సీహెచ్.నరేష్(ఆంధ్రజ్యోతి), కార్యదర్శులుగా శ్రీకాంత్(నమస్తే తెలంగాణ), చందుగౌడ్ (సిద్దిపేట్ టైమ్స్), కోశాధికారులుగా వీరబోయిన శివకృష్ణ(ప్రజాపక్షం) నరాల శ్రీకాంత్(దిశ), సంయుక్త కార్యదర్శిగా శ్రవణ్‌కుమార్(టీజీఎస్ చానల్), ఈసీ సభ్యులుగా ప్రవీణ్(ఈనాడు), నరసింహ(మన తెలంగాణ), వీరబోయిన పృథ్వీరాజ్(జనం న్యూస్) తదితరులను ఎన్నుకున్నారు.



మెదక్ జిల్లా కార్యాలయం ఎదుట బీజేపీ జెండాను ఎగురవేస్తున్న అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్



సంగారెడ్డి శివారులోని జిల్లా కార్యాలయంలో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి

బీజేపీతోనే దేశాభివృద్ధి

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పలువురు పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీ కార్యాలయాల వద్ద బీజేపీ జెండాను ఎగురవేశారు.

\- న్యూస్ నెట్‌వర్క్



జిన్నారంలో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు



చిన్నశంకరంపేట బీజేపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న నాయకులు



నర్సాపూర్‌లో జెండాను ఎగురవేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్